కలం
kalamdaily.com
Follow on: Kalamtelugu
ప్రజల గళం...
సోమవారం
16-03-2026
పేజీలు: 03
360° SINGLE TOPIC
సభాపర్వం

**'సభను ఎన్ని రోజులు నడపడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది..'**

.. అధికార పక్షం తరచూ చెప్పే మాట ఇది!

**'కేవలం బిల్లుల ఆమోదం కోసమే సభను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు..'**

.. ప్రతిపక్షం రెగ్యులర్‌గా చేసే కామెంట్ ఇది!

ఏ పక్షం వాదన ఎలా ఉన్నా ఏటేటా అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల సిట్టింగ్ డేస్ తగ్గిపోతూ ఉన్నాయి. బీఆర్ఎస్ రెండో టర్మ్‌లో (2019-23) మొత్తంగా 73 రోజులే జరిగింది. సంవత్సరానికి సగటున 15 రోజులైనా జరగలేదు. ఏడాదికి కనీసంగా రెండుసార్లు చట్టసభలు సమావేశం కావాలన్న నిబంధనే తప్ప.. నిర్దిష్టంగా ఎన్ని రోజులు జరగాలనే స్పష్టత లేకపోవడంతో సెషన్స్ ఒక ప్రహసనంగానే మిగిలిపోయాయి.

అధికార, ప్రతిపక్షాలు కలిస్తేనే ప్రభుత్వం అంటూ నేతలు గంభీర ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం అసెంబ్లీ సమావేశాలు నామమాత్రం. సభను తప్పదోవ పట్టిస్తున్నారంటూ అధికార పక్షం, మాట్లాడడానికి అవకాశమే ఇవ్వడం లేదంటూ ప్రతిపక్షం పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌కు ప్రాధాన్యం తగ్గిపోతున్నది. ఫలితంగా ప్రజల, నియోజకవర్గాల సమస్యలను సభ్యులు ప్రస్తావించలేకపోతున్నారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం...

తెలంగాణ బ్యూరో, కలం



# ఇదేంది అధ్యక్షా..!

## తెలంగాణ వచ్చినప్పటి నుంచి తగ్గిపోతున్న సభా సమయం
## ఏడాదికి రెండు ప్రశ్నలన్నా అడగలేకపోతున్న సభ్యులు
## అటు సీఎంను కలవలేక.. ఇటు సభలో మాట్లాడే చాన్స్ రాక ఆవేదన
## సభకు తరచూ అంతరాయం.. వృథా అవుతున్న ప్రజాధనం

### దేశంలో అతి తక్కువ ఇక్కడే

అసెంబ్లీ సమావేశాలు అతి తక్కువ రోజులు జరుగుతున్నది తెలంగాణలోనే. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఫస్ట్ టర్మ్‌లో (2014-18) నాలుగున్నరేండ్లలో మొత్తం 126 రోజుల పాటు సమావేశాలు జరిగితే సెకండ్ టర్మ్‌లో (2018-23) ఐదేండ్లలో 73 రోజులే జరిగాయి. సంవత్సరానికి సగటున 15 రోజులకంటే తక్కువే. దేశంలోనే అతి తక్కువ రోజులు సమావేశమైన అపఖ్యాతిని తెలంగాణ మూటగట్టుకున్నది. ప్రస్తుత ప్రభుత్వం రెండేండ్ల మూడు నెలల్లో 49 రోజులు సమావేశమైంది. సగటున సంవత్సరానికి పాతికరోజుల కంటే తక్కువే. ఉమ్మడి రాష్ట్రంలో 2004-14 మధ్య కాలంలో మొత్తం 423 రోజులు సభ జరిగింది. సగటున ప్రతి సంవత్సరం 42 రోజుల పాటు జరిగినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. చివరి రెండు సంవత్సరాల్లో (2013, 14) తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం కారణంగా ఆటంకాలు ఏర్పడ్డాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఫస్ట్ టర్మ్‌లో సంవత్సరానికి 25 రోజుల చొప్పున, సెకండ్ టర్మ్‌లో 15 రోజుల చొప్పున మాత్రమే జరిగాయి.

**ఉమ్మడి రాష్ట్రంలో (2004-14) : 423 రోజులు**
**తెలంగాణ ఫస్ట్ టర్మ్‌లో (2014-18): 126 రోజులు**
**సెకండ్ టర్మ్‌లో (2018-23) : 73 రోజులు**

### సగానికి తగ్గిన సిట్టింగ్ డేస్

ఉమ్మడి ఏపీతో పోలిస్తే, తెలంగాణ వచ్చిన తర్వాత అసెంబ్లీ సమావేశాలు తగ్గిపోయాయి. ఉమ్మడి ఏపీలో ఏటా 40 రోజులకు పైగా సభ నడిస్తే, తెలంగాణ వచ్చిన తర్వాత అది 20 రోజులకు తగ్గింది. అంటే అసెంబ్లీ సిట్టింగ్ డేస్ సగానికి తగ్గిపోయాయి. ఉమ్మడి ఏపీలో 12వ అసెంబ్లీ (2004–2009) 214 రోజులు నడిచింది. అత్యధికంగా 2005లో మూడు సెషన్లలో 46 రోజుల పాటు సమావేశమైంది. 13వ అసెంబ్లీ (2009–2014) 209 రోజులు నడిచింది. అత్యధికంగా 2010లో మూడు సెషన్లలో 44 రోజుల పాటు సమావేశమైంది. ఇక తెలంగాణ వచ్చాక మొదటి అసెంబ్లీ (2014–2018) 126 రోజులు, రెండో అసెంబ్లీ (2018–2023) 73 రోజులు నడిచింది. 2023లో కొలువుదీరిన మూడో అసెంబ్లీ.. ఇప్పటి వరకు దాదాపు రెండున్నరేండ్ల కాలంలో 49 రోజులు సమావేశమైంది. ఉమ్మడి ఏపీలో ఒక్కో సెషన్ సగటున 12 నుంచి 15 రోజులు నడిస్తే, తెలంగాణలో ఒక్కో సెషన్ 10 రోజుల్లోపే ముగిసింది. కొన్ని సెషన్స్ అయితే రెండు మూడ్రోజులే నిర్వహించి అసెంబ్లీని వాయిదా వేసిన సందర్భాలు ఉన్నాయి.

## మొక్కుబడిగా ప్రశ్నోత్తరాల సమయం

లక్షలాది మంది ప్రజలకు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తారు. వారి నియోజకవర్గాల్లోని అభివృద్ధి, సంక్షేమ అంశాలను సభావేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనుకుంటారు. ప్రజల డిమాండ్లు, అవసరాలను సభలో ప్రస్తావించాలనుకుంటారు. ఇందుకు జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయాన్ని వాడుకోవాలని కోరుకుంటారు. కానీ సభ్యులకు ఆ అవకాశాలు చాలా తక్కువే ఉంటున్నాయి. సభ్యులు ఒక్కొక్కరు సగటున ఏడాదికి రెండు ప్రశ్నలు కూడా అడగలేకపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో (2018-23) సభ్యులకు సగటున 8 ప్రశ్నలకు మాత్రమే అవకాశం లభించింది. ఓరల్, రిటెన్, సప్లిమెంటరీ.. ఇలా అన్ని రకాలుగా కలిపి మొత్తం 1,017 ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు వచ్చాయి. ప్రస్తుత ప్రభుత్వంలో 457 ప్రశ్నలు లేవనెత్తగలిగారు.

2018-23 : 1,017 ప్రశ్నలు
2023-2026 : 457 ప్రశ్నలు



## 'జీరో అవర్'కు తగ్గిన ప్రాధాన్యం

సభ్యులు వారి నియోజకవర్గాలకు, ప్రజలకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి జీరో అవర్‌ను వాడుకోవాలని కోరుకుంటారు. చట్టసభల వేదికగా ప్రస్తావిస్తే ప్రభుత్వం ఇచ్చే జవాబుకు, హామీకి జవాబుదారీతనం ఉంటుందనే భరోసా ఇందుకు కారణం.
కానీ గత ప్రభుత్వంలోనూ, ఇప్పుడూ ఆ అవకాశాలు చాలా తక్కువ. సమస్యలను సంబంధిత మంత్రులను కలిసి మొరపెట్టుకున్నా ముఖ్యమంత్రి ఆమోదం తప్పనిసరి అవుతున్నది. కానీ, సీఎంను కలిసే అవకాశాలు లేకపోవడంతో అసెంబ్లీలో జీరో అవర్ ఏకైక దిక్కవుతున్నది. అందువల్లనే అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ పనులు, పేరుకుపోయిన సమస్యలు.. ప్రస్తావించక తప్పడం లేదు. వీటికి సమాధానం ఇవ్వాల్సిన సంబంధిత మంత్రులు ఆ సమయానికి అసెంబ్లీలో ఉండడంలేదు. దీంతో అప్పుడు అందుబాటులో ఉన్న మంత్రులు 'నోట్ చేసుకున్నాం అధ్యక్షా.. సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తాం..' అనే సమాధానంతో సరిపెట్టేస్తున్నారు.

## నాడు కేసీఆర్.. నేడు రేవంత్...

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల కాలాన్ని 'గడీల పాలన' అంటూ కాంగ్రెస్ విమర్శించింది. సీఎం అధికారిక బంగళా 'ప్రగతి భవన్'ను 'గడీ' అంటూ అభివర్ణించింది. ముఖ్యమంత్రిని కలవడానికి సభ్యులకు అవకాశమే లేదని, గడీ ముందు పడిగాపులు తప్పలేదని కామెంట్ చేసింది. హోంమంత్రి మహమూద్ అలీకి సైతం ఆ ఇబ్బంది తప్పలేదని ఉదహరించింది. గడీని తలపించే 'ప్రగతి భవన్'ను 'ప్రజా భవన్'గా మార్చి ముండ్ల కంచెలను తొలగించామని, ప్రమాణ స్వీకార సమయంలోనే ఈ మార్పు జరిగిందని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాచరిక పాలనను 'ప్రజా పాలన'గా మార్చామని చెప్పారు. అయినా ముఖ్యమంత్రిని కలవడానికి ఎమ్మెల్యేలకు ఆశించిన స్థాయిలో అవకాశాలు లేకపోవడంతో అసెంబ్లీ వేదికగా జీరో అవర్‌లో ప్రభుత్వ వైఫల్యాలను అధికార పార్టీ ఎమ్మెల్యేలే సమస్యల రూపంలో ప్రస్తావిస్తున్నారు. అప్పుడూ, ఇప్పుడూ అదే ట్రెండ్ కొనసాగుతున్నది.





## స్పీకర్ల తీరుపై విమర్శలు

పార్టీలకు అతీతంగా వ్యవహరించాల్సిన అసెంబ్లీ స్పీకర్‌లు తెలంగాణ ఏర్పాటు తర్వాత నుంచి విపక్షాల విమర్శలు ఎదుర్కొంటున్నారు. అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదన్నవి ప్రధాన ఆరోపణలు. కేసీఆర్ సీఎం అయిన రెండు టర్ముల్లోనూ కాంగ్రెస్, బీజేపీ సభ్యులు తరచూ సస్పెన్షన్‌కు గురయ్యారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను సవాలు చేస్తూ కోర్టుల్లో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. కిషన్‌రెడ్డి, జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి, సీతక్క.. ఇలా అనేకమందిపై అప్పట్లో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈ నిర్ణయం కూడా నిబంధనల మేరకు జరగలేదన్న విమర్శలు వచ్చాయి. ప్రజలు ఎన్నుకుని సభకు పంపిస్తే కనీస ప్రజాస్వామిక స్ఫూర్తి కూడా పాటించకుండా స్పీకర్ సస్పెండ్ చేశారన్న చర్చ సభ లోపలే జరిగింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.



## రోజుకు రూ. 25 లక్షల ఖర్చు!

అటు లోక్‌సభ, రాజ్యసభల్లోగానీ, ఇటు రాష్ట్రాల అసెంబ్లీల్లోగానీ అర్థవంతమైన చర్చ జరగడం లేదన్నది వాస్తవం. సభ వెలుపల ప్రతిపక్షాల ప్లకార్డుల నిరసనలు, బ్యానర్లతో ప్రదర్శనలు రొటీన్ ప్రాక్టీస్. సభ లోపల నినాదాలు, స్పీకర్ వెల్ దగ్గరకు దూసుకుపోవడం, రన్నింగ్ కామెంటరీ చేయడం కూడా అంతే. పార్లమెంటులోని ఉభయ సభలకు ఒక నిమిషానికి సుమారు రెండున్నర లక్షల రూపాయల ప్రజాధనం ఏసీలు, ఉద్యోగుల వేతనాలు, సబ్సిడీ ధరపై ఫుడ్ సప్లై.. ఇలాంటి అవసరాలకు ఖర్చవుతున్నట్లు అంచనా. గంటకు కోటిన్నర చొప్పున ఒక రోజుకు రూ. 9 కోట్లు (యాక్టివ్ సెషన్‌ను సగటున రోజుకు ఆరు గంటలుగా లెక్కిస్తే) ఖర్చవుతున్నట్లు పలు సందర్భాల్లో విపక్షాల సభ్యులు కామెంట్ చేసేవారు. తెలంగాణ అసెంబ్లీలో యాక్టివ్ సెషన్ టైమ్‌లో రోజుకు యావరేజ్‌గా రూ. 25 లక్షలు ఖర్చవుతున్నట్లు అంచనా. సభకు అంతరాయం కలిగించి నడవకుండా చేస్తే ప్రజలు వివిధ పన్నుల రూపంలో కడుతున్న డబ్బును వృథా చేయడమేనని ప్రభుత్వాలు చెప్తుంటాయి.

## బాధ్యత మరుస్తున్న ఎమ్మెల్యేలు

సభ జరిగేటప్పుడు చాలామంది సభ్యులు చర్చల్లో పాల్గొనడం లేదని, హాల్ లోపల ఉండడం లేదన్న విమర్శలు గతం నుంచీ ఉన్నాయి. టీ విరామం, భోజన విరామం సమయం తర్వాత సభ ప్రారంభం కావడానికి 'కోరం'గా కనీసం 10% మంది సభ్యులు హాల్ లోపల ఉండాలన్నది నిబంధన. అప్పుడే సభ పునఃప్రారంభమవుతుంది. కానీ కోరం లేదనే పేరుతో పలుమార్లు సభ సకాలంలో రీస్టార్ట్ కాలేదు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ, పార్టీ విప్‌ల ద్వారా సభ్యులకు సున్నితంగానే హెచ్చరిక ఇచ్చారు. సభలో కీలకమైన అంశాలపై చర్చ జరిగేటప్పుడు సభ్యులు నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా ఉండొద్దని సూచించారు. మరోవైపు అధికార, విపక్ష సభ్యుల మధ్య పరస్పర వాదనలు, రన్నింగ్ కామెంట్రీ, చర్చలకు ఆటంకం కలిగించడం.. వీటితో సమయం వృథా అవుతున్నదన్న విమర్శలు ప్రతీ సెషన్‌లో రొటీన్‌గా చోటుచేసుకుంటున్నాయి.

## ఉమ్మడి ఏపీలో ఏటా 40 రోజులకుపైగా

**2004 – 2009:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 12వ అసెంబ్లీ (2004–2009) 214 రోజులు నడిచింది. ఐదేండ్ల కాలంలో ఏటా 3 సెషన్స్ చొప్పున మొత్తం 15 సెషన్స్ జరిగాయి. ప్రతి ఏడాది దాదాపు 40 రోజులకు పైగా సమావేశాలు నడిచాయి. అత్యధికంగా 2005లో 46, 2006లో 45 రోజుల పాటు సమావేశాలు జరిగాయి.

**2009–2014:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 13వ అసెంబ్లీ (2009–2014) 209 రోజులు నడిచింది. ఐదేండ్ల కాలంలో మొత్తం 13 సెషన్స్ జరిగాయి. 2014లో రెండు సెషన్స్ జరగ్గా, మిగతా అన్ని సంవత్సరాల్లో ఏటా 3 సెషన్స్ చొప్పున జరిగాయి. ప్రతి ఏటా దాదాపు 40 రోజుల పాటు సమావేశాలు నడిచాయి. అత్యధికంగా 2010లో 44, 2009లో 39 రోజుల పాటు సమావేశాలు జరిగాయి.

### ఉమ్మడి ఏపీ అసెంబ్లీ సమావేశాల వివరాలివీ..

**2004 – 2009 (15 సెషన్స్, 214 రోజులు)**

| ఏడాది | సెషన్స్ | రోజులు |
|---|---|---|
| 2004 | 2 | 39 |
| 2005 | 3 | 46 |
| 2006 | 3 | 45 |
| 2007 | 4 | 43 |
| 2008 | 3 | 41 |
| 2009 | 0 | 0 |

(నోట్: 2009 మే 20న వైఎస్ నేతృత్వంలో కాంగ్రెస్ సర్కార్ రెండోసారి కొలువుదీరింది. అయితే ఆ ఏడాది జనవరి నుంచి అసెంబ్లీ సమావేశాలేమీ జరగలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూన్‌లో జరిగాయి)

**2009 – 2014 (13 సెషన్స్, 209 రోజులు)**

| ఏడాది | సెషన్స్ | రోజులు |
|---|---|---|
| 2009 | 3 | 39 |
| 2010 | 3 | 44 |
| 2011 | 2 | 36 |
| 2012 | 3 | 38 |
| 2013 | 2 | 27 |
| 2014 | 0 | 25 |

(నోట్: 2013లో జరిగిన 13వ సెషన్‌కు కొనసాగింపుగానే 2014లో అసెంబ్లీ సమావేశాలు జరిగాయి)

### తెలంగాణ ఫస్ట్ అసెంబ్లీ (2014-2018)

| సెషన్ | తేదీలు | రోజులు |
|---|---|---|
| సెషన్-1 | జూన్ 9-14, 2014 | 6 |
| సెషన్-2 | నవంబర్ 5-29, 2014 | 19 |
| సెషన్-3 | మార్చి 7-26, 2015 | 14 |
| సెషన్-3/2 | సెప్టెంబర్ 23-అక్టోబర్ 7, 2015 | 7 |
| సెషన్-4 | మార్చి 10-31, 2016 | 17 |
| సెషన్-5 | ఆగస్టు 30, 2016 | 1 |
| సెషన్-6 | డిసెంబర్ 16-జనవరి 18, 2017 | 18 |
| సెషన్-7 | మార్చి 10-27, 2017 | 13 |
| సెషన్-7/2 | ఏప్రిల్ 16, 2017 | 1 |
| సెషన్-7/3 | ఏప్రిల్ 30, 2017 | 1 |
| సెషన్-8 | అక్టోబర్ 27-నవంబర్ 17, 2017 | 16 |
| సెషన్-9 | మార్చి 12-29, 2018 | 13 |
| **మొత్తం** | - | **126** |

## తెలంగాణలో ఏటా 20 రోజుల్లోపే..

**2014–2018:**
తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి అసెంబ్లీ (2014–18) 126 రోజులు నడిచింది. ఐదేండ్ల కాలంలో మొత్తం 9 సెషన్స్ జరిగాయి. 2014లో రెండు, 2015లో ఒక్కటి, 2016లో రెండు, 2017లో మూడు, 2018లో ఒక్క సెషన్ చొప్పున జరిగాయి. 2014 నవంబర్‌లో జరిగిన రెండో సెషన్‌లో అత్యధికంగా 19 రోజుల పాటు అసెంబ్లీ నడిచింది.

**2018–2023:**
తెలంగాణ రెండో అసెంబ్లీ (2018–23) 73 రోజులు నడిచింది. ఐదేండ్ల కాలంలో మొత్తం 8 సెషన్స్ జరిగాయి. 2018లో ఒక్కటి, 2019లో మూడు, 2020లో రెండు సెషన్స్ చొప్పున జరిగాయి. 2021 సెప్టెంబర్‌లో 8వ సెషన్ ప్రారంభం కాగా, 2023 వరకు అదే సెషన్‌కు కొనసాగింపుగా సమావేశాలు నిర్వహించారు. 2019 సెప్టెంబర్‌లో జరిగిన 4వ సెషన్‌లో అసెంబ్లీ అత్యధికంగా 10 రోజులు నడిచింది. మిగతా ఏ సెషన్‌లోనూ 10 రోజులు దాటలేదు.

### తెలంగాణ సెకండ్ అసెంబ్లీ (2018-2023)


| సెషన్ | తేదీలు | రోజులు |
|---|---|---|
| సెషన్-1 | జనవరి 17-20, 2018 | 4 |
| సెషన్-2 | ఫిబ్రవరి 22-మార్చి 5, 2019 | 3 |
| సెషన్-3 | జూలై 18-19, 2019 | 2 |
| సెషన్-4 | సెప్టెంబర్ 9-22, 2019 | 10 |
| సెషన్-5 | మార్చి 6-16, 2020 | 8 |
| సెషన్-6 | సెప్టెంబర్ 7-16, 2020 | 8 |
| సెషన్-6/1 | అక్టోబర్ 13, 2020 | 1 |
| సెషన్-7 | మార్చి 15-26, 2021 | 9 |
| సెషన్-8 | సెప్టెంబర్ 24-అక్టోబర్ 8, 2021 | 7 |
| సెషన్-8/2 | మార్చి 7-15, 2022 | 7 |
| సెషన్-8/3 | సెప్టెంబర్ 6-13, 2022 | 3 |
| సెషన్-8/4 | ఫిబ్రవరి 3-12, 2023 | 7 |
| సెషన్-8/5 | ఆగస్టు 3-8, 2023 | 4 |
| **మొత్తం** | - | **73** |

**2023 డిసెంబర్ నుంచి:**
తెలంగాణ 3వ అసెంబ్లీ 2023 డిసెంబర్‌లో కొలువుదీరింది. మొదటి సెషన్ డిసెంబర్ 9 నుంచి 21 వరకు జరగ్గా, 6 రోజులు అసెంబ్లీ నడిచింది. 2024లో మూడు సెషన్స్, 2025లో రెండు సెషన్స్ జరగ్గా.. 2026లో ఒక్క సెషన్ జరిగింది. ఈ రెండున్నరేండ్ల కాలంలో మొత్తం 49 రోజుల పాటు అసెంబ్లీ నడిచింది.

**కేసీఆర్ హయాంలో మొదటి టర్మ్‌లో ఏటా 20 నుంచి 25 రోజులు, రెండో టర్మ్‌లో ఏటా 15 రోజుల్లోపే అసెంబ్లీ నడిచింది. ఇక ఇప్పుడు రేవంత్ హయాంలో ఈ రెండున్నరేండ్ల లెక్కలను పరిశీలిస్తే.. ఏటా 20 రోజుల్లోపే అసెంబ్లీ నడిచినట్టు స్పష్టమవుతున్నది.**

### తెలంగాణ థర్డ్ అసెంబ్లీ (2023 నుంచి)

| సెషన్ | తేదీలు | రోజులు |
|---|---|---|
| సెషన్-1 | డిసెంబర్ 9-21, 2023 | 6 |
| సెషన్-2 | ఫిబ్రవరి 8-17, 2024 | 8 |
| సెషన్-3 | జూలై 23-ఆగస్టు 2, 2024 | 9 |
| సెషన్-4 | డిసెంబర్ 9-21, 2024 | 7 |
| సెషన్-5 | మార్చి 12-27, 2025 | 11 |
| సెషన్-6 | ఆగస్టు 30-సెప్టెంబర్ 1, 2025 | 3 |
| సెషన్-7 | డిసెంబర్ 29-జనవరి 6, 2026 | 5 |
| **మొత్తం** | - | **49** |



### లోక్‌సభ సమావేశాల వివరాలివీ..

| లోక్‌సభ టర్మ్ | రోజులు |
|---|---|
| 1952-57 | 677 |
| 1957-62 | 586 |
| 1962-67 | 578 |
| 1967-70 | 468 |
| 1971-77 | 613 |
| 1977-79 | 195 |
| 1980-84 | 408 |
| 1984-89 | 423 |
| 1989-91 | 145 |
| 1991-96 | 422 |
| 1996-97 | 126 |
| 1998-99 | 90 |
| 1999-2004 | 356 |
| 2004-09 | 332 |
| 2009-14 | 345 |
| 2014-19 | 331 |
| 2019-24 | 274 |